www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 మార్చి 2024

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప

జిల్లా వ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ కోరారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి 24 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 4, రాజంపేటలో 1, రాయచోటిలో3, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622 లలో సంప్రదించాలన్నారు.

వైసిపిలో టికెట్ల టెన్షన్

- సిట్టింగులకు తప్పని కలవరం
- నేడు ఇడుపులపాయలో వైఎస్ జగన్ ప్రకటన
- రాష్ట్ర వ్యాప్తంగా టికెట్ల ప్రకటనకు ఛాన్స్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపిలో టికెట్ల టెన్షన్ నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ నేడో, రేపో ప్రకటన వెలువడనుంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తుది విడత కింద రాష్ట్ర వ్యాప్తంగా 25 లోక్‌సభ, 175 అసెంబ్లీలకు అభ్యర్థిత్వాలను ఖరారు చేయనున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 11 విడతలుగా పలు అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. మిగిలిన సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. శనివారం ఇడుపులపాయకు చేరుకుని వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లకు అభ్యర్థిత్వాల పేర్లను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. తుది కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో రాజంపేట సమన్వయకర్తను మినహా మిగిలిన 12 అసెంబ్లీ, రెండు పార్లమెంట్‌స్థానాలకు సమన్వయకర్తలను ప్రకటించాల్సి ఉన్న సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలకు గుబులు పట్టుకుంది. రాజంపేట అభ్యర్థిత్వాన్ని మార్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఏఏ స్థానాలకు ఎవరి పేర్లు గల్లంతు కానున్నాయి. ఎవరి పేర్లు పదిలంగా ఉండే అవకాశం ఉం దనే ఆందోళన నెలకొంది. రాష్ట్రంలోని పెండింగ్ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు సైతం అభ్యర్థిత్వాలను దాదాపుగా ఖరారు చేసే అవకాశం ఉంది.

ఏప్రిల్16 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

- 22న కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పరిశీలన
- టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16 నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్16న సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 22న శ్రీ కోదండరాముడి కల్యాణం కమనీయంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు, కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నెల రోజుల ముందే టిటిడి ఈ పనులను ప్రారంభించిందని తెలిపారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, భక్తులను అనుమతించాల్సిన విధానం, తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీపై సమీక్షించామన్నారు. గ్యాలరీల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ సారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించేలా నిర్వహిస్తామన్నారు. భక్తులం దరికీ ముత్యాల తలంబ్రాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయనతో పాటు టిటిడి చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణరెడ్డి, డిప్యూటీ ఇఒలు, నటేష్‌బాబు, ప్రశాంతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ ఉన్నారు.

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న జెఇఒ వీరబ్రహ్మం

రాజకీయ బదిలీలు రద్దు చేయాలి : యుటిఎఫ్

డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులు పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సెలింగ్ విధానాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వమే సిఫార్సు బదిలీలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ప్రభుత్వ సిఫార్సు బదిలీలను రద్దు చేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. అక్రమ బదిలీలు ఆపాలంటూ డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ విధంగా సిఫార్సు బదిలీలు చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, హిందీ, తెలుగు పండిట్ల ప్రమోషన్లు, వివిధ జిల్లాలలో పెండింగ్‌లో ప్రమోషన్లు ఇవ్వటానికి నిబంధనలు ఆటంకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారని, మరి కౌన్సిలింగ్‌తో సంబంధం లేకుండా సిఫార్సు బదిలీలు చేయడానికి ఏ నిబంధనలు ఆటంకం కావడంలేదా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల కోరిక మేరకే బదిలీలు చేస్తున్నామని ప్రభుత్వం బూటకపు మాటలు చెబుతోందని పేర్కొన్నారు. అదే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వద్దని చెబుతున్న జిఒ నంబరు117, అప్రెంటీస్ విధానాన్ని ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. సుమారు 1200పైగా ప్రభుత్వం సిఫార్సు బదిలీలు చేయడం విద్యారంగానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించే కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే ప్రభుత్వ సిఫార్సు బదిలీలు వెంటనే రద్దు చేయాలని, లేకుంటే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి, జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్య మేరీ, సిడిపి ప్రత్యూష, ఆడి కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కేదార్నాథ్, బత్తుల చంద్రశేఖర్, సిద్దయ్య, జి. వెంకటసుబ్బయ్య, మజ్జారి చెన్నకేశవులు, కిరణ్ కుమార్, సుబ్బారావు, శ్రీకాంత్, శివ శంకర్, బాబు, శంకర్ రెడ్డి, పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పి.చిన్న రెడ్డన్న

ప్రజాశక్తి - కడప/కడప అర్బన్

పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా అన్నమయ్య జిల్లా రాయచోటి మాజీ మండల విద్యాశాఖ అధికారి, పిఎస్‌టియు రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.చిన్న రెడ్డన్నను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్. ఎలియాస్ రెడ్డి, రాష్ట్ర సమైక్య అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి రామాంజనేయరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పసుపులేటి శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం గుంటూరులో నిర్వ హించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గా పసుపులేటి శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పదవి రావడానికి కృషి చేసిన ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. పురుషోత్తం నాయుడు, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు లెక్కల కొండారెడ్డి, జిల్లా పెన్షనర్ల అధ్యక్షులు చెన్నారెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. తన మీద నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న వారికి అన్ని విధాలా సహాయ సహకారాన్ని అందిస్తామన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా డేనియల్ బాబు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం ఎర్రగుడిపల్లె చెందిన డేనియల్ బాబు వైసిపి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తన సేవలను గుర్తించి వైసిపి అధిష్టానం ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల డేనియల్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపఎ మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు నిక్కచ్చిగా నిర్వర్తిస్తానని చెప్పారు. బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి, కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్. భాస్కర్ రెడ్డికి, వై.ఎస్. మనోహర్‌రెడ్డికి, వై.ఎస్ మదనమోహన్ రెడ్డికి, వైయస్ అభిషేక్ రెడ్డికి, దేవి రెడ్డి శివశంకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - బద్వేలు

ప్రభుత్వం వసతి గృహాలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వైవియూ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రగొల్ల గోపాలస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని బిసి బాలుర వసతి గృహాన్ని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని, ఉన్నత విద్య వల్లనే సమాజంలో గౌరవం, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బి.సి హాస్టల్ లోని పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి నగదుతో పాటు ప్రశంసా పత్రం, సావిత్రిబాయి పూలేల మెమెంటో ఇస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ నైతిక విలువలతో చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని చెప్పారు. ఉన్నత ఆశయాల లక్ష్యసాధన కలలను కని వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హాస్టల్ విద్యార్థులు కుల మతాలకు అతీతంగా మంచి స్నేహాలతో కలిసిమెలిసి ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ధ్యానం ద్వారా జ్ఞాపకశక్తి, జ్ఞానం పెరుగుతందని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సమయ పాలన, పట్టుదల, అంకితభావంతో కృషిచేస్తే సాధించలేనిది ఏమీ లేదని అన్నారు. వసతి గృహాలలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. రామసుబ్బయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు యు.రమణ యాదవ్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆహారం తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 18, 19 తేదీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుధాన్యాలను ముడిసరుకుగా ఉపయోగించి వ్యాపారం మెరుగుపరచడంపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమన్నారు. చిరుధాన్యాలను ఉపయోగించడం ద్వారా గుండెజబ్బుల ప్రమాదాన్ని తగ్గించి మధుమేహం నుంచి రక్షిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా 9885668592 కు మెసేజ్ చేసి తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవలసిందిగా ఆయన పేర్కొన్నారు.

మానవతకు ప్రతిరూపం వివేకా

- వివేకా వర్ధంతి సభలో షర్మిల, సునీత
- సునీత పోరాటానికి అండగా ఉంటాం : టిడిపి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాజీ మంత్రి వైఎస్ వివేకా మానవతకు ప్రతిరూపమని పిసిసి ఛీఫ్ వైఎస్ షర్మిల పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర శివారులోని జయరాజ గార్డెన్స్‌లో నిర్వహించిన వివేకా ఐదవ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్ వివేకా స్మారకార్థం...జ్ఞాపకార్థ సమావేశానికి పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ వైఎస్ వివేకా మంచి మనిషి, అద్భుతమైన వ్యక్తిత్వం, అందరికీ సహాయపడే గుణం కలిగిన వారని కొనియాడారు. ఇటువంటి అరుదైన వ్యక్తిత్వం కలిగిన నాయకుని క్రూరాతికూరంగా హత్య చేయడాన్ని మరిచిపోలేక పోతున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ తమ్ముడికి ఐదేళ్లుగా న్యాయం జరగని నేపథ్యంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మొదట గుండెపోటుతో చనిపోయాడని ప్రచారం చేశారని, సాక్షి టివిలో కూడా ఇదే విషయాన్ని కవరేజ్ చేసిందని, ఇక్కడకు వచ్చాకే హత్య గురించి తెలిసిందని, ఎవరు చేశారో అప్పుడు తెలియదని, ఆనీ ఇప్పుడు తెలుస్తున్నాయని, బంధువులే హత్య చేశారని అందరికీ తెలుసునన్నారు. చిన్నాన్న హత్య కేసులో వైఎస్ సౌభాగ్యమ్మ, సునీత ఎక్కువ నష్టపోయారన్నారు. చెల్లెలికి న్యాయం చేయాల్సింది పోయి చివరికి సునీత హత్య చేసిందని చెప్తున్నారన్నారు. సోషల్ మీడియాలో బెదిరింపులు, బూతులు, తోడబుట్టిన చెల్లెళ్లను అవమానాలను తట్టుకుని నిలబడిందని తెలిపారు. న్యాయం కోసం సునీత తిరగని చోటు, తట్టని వాకిలి, తొక్కని గడప లేదని చెప్పారు. సునీత కుటుంబం హత్య చేసి ఉంటే ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలన్నారు. సునీత న్యాయ, ధర్మ పోరాటానికి ఆయుధాన్నై భాగస్వామిని అవుతానని ప్రకటించారు. చిన్నాన్న ఆత్మకు శాంతి చేకూరే వరకు పోరాటం ఆగదని చెప్పారు. హత్యా రాజకీయాలను ఛీకొట్టా లని, అంతిమంగా నిజం గెలిచేలా ప్రజలు ఓటు ద్వారా స్పందించా లని విజ్ఞప్తి చేశారు. వైఎస్ వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ మీ చిన్నాన్నను చంపిన, చంపించిన వారిని గుర్తించాలి, అది ముఖ్యమంత్రిగా మీబాధ్యత. అది నేనైనా, నాకుటుంబ మైనా తేల్చాలి. నేను చంపినట్లు ఆధారం ఉంటే సిబిఐకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హంతకులను గుర్తించిన వారికి ఐదు లక్షల రివార్డు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతకుముందు మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, పులివెందుల టిడిపి అభ్యర్థి బి.టెక్ రవి, మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నజీర్‌అహ్మద్ తదితరులు ప్రసంగంలో వివేకా కుమార్తె సునీత న్యాయ పోరాటానికి అండగా ఉంటాయని చెప్పారు. వర్ధంతి కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివేకా వర్ధంతి సభలో మాట్లాడుతున్న వై.ఎస్.సునీత

వైఎస్ వివేకాకు ఘన నివాళి

పులివెందుల టౌన్ : మాజీ మంత్రి వై.ఎస్. వివేకానందరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని వివేకా సమాధి వద్ద కుమార్తె వై.ఎస్. సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, బామ్మర్ది శివ ప్రకాష్‌రెడ్డి , జగన్ బాబాయ్ వై.ఎస్? సుధీకర్ రెడ్డి , అభిమానులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివేక పార్క్‌లోని వివేకానంద రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసే నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులు అభిమానులతో కలిసి కడప జయరాజ్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన స్మారకోత్సవ, జ్ఞాపకార్థ సమావేశానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్ వివేక కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

వివేకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వై.ఎస్.షర్మిల

పులివెందులలో వివేకా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సునీత, కుటుంబ సభ్యులు

గ్రూప్-1 పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని -16 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఎపిపిఎస్‌సి గ్రూప్-1 స్క్రీనింగ్ నోటిఫికేషన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంయుక్త కలెక్టరు జి. గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాల్‌లో గ్రూప్ -1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై సంయుక్త కలెక్టర్, ఎపిపిఎస్‌సి పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులు, పర్యవేక్షకులు సయాద్ నాగూర్ షరీఫ్, యం. రామంజి లతో కలిసి పరీక్షల విధులు కేటాయించిన 18 మంది లైజెన్ ఆఫీసర్లు, 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 17న ఉదయం పది గంటల నుంచి మధ్యహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు ఉదయం 09.00 గంటల నుండి 09.45 గంటల వరకు , మధ్యాహ్నం 01.00 గంట నుండి 01.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయా లన్నారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 07, చెన్నూరు మండల పరిధిలో 01, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో 04, చాపాడు మండల పరిధిలో 01, ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో 03 పరీక్షా కేంద్రంతో కలిపి మొత్తం 16 కేంద్రాల్లో పరీక్ష ఉంటు ందని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాల అధికారి విజయ్ కుమార్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ సెక్షన్ ఆఫీసర్లు, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైన్ డిపార్టుమెంట్ల సంబంధితాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి గణేష్ కుమార్

సైనిక్ ప్రవేశ ఫలితాల్లో 'బాలవికాస్' ప్రతిభ

ప్రజాశక్తి - కడప

ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో కడప నగరంలోని బాల వికాస్ స్కూల్ విద్యార్థులు అఖండ విజయం సాధించినట్లు కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో కడప నగరంలోని బాలవికాస్ పాఠశాలలో శిక్షణ తీసుకున్న విద్యా ర్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జాతీయస్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులలో బి. ఆరాధ్య కృష్ణ (275/300), సి.వి. నిరపం రెడ్డి(274/300), పి. కళ్యాణ్ రామ్(264/300), డి. అభినవ్ రెడ్డి(261/300), ఎస్ ఎం డి రయాన్(261/300), ఎం లక్ష్మి మాతేష్ (260/300), బి. హిమజ(258/300), ఎం.నరసింహ దినేష్ (256/300), వై. శ్రావణ్ సిద్ధాంత్ రెడ్డి(257/300) ఉన్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో శిక్షణ పొంది జాతీయస్థాయిలో 351, 396, 992 ర్యాంకులు సాధి ంచిన విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పరీక్షకు 78 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 75 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు వారు తెలిపారు. అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపకులు ధరణి కుమార్, హైమావతి, లావణ్యను పాఠశాల యాజమాన్యం తరపున అభినందించినట్లు తెలిపారు.

హక్కులను వినియోగించుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

వినియోగదారులు తమ హక్కులను చట్టపరంగా వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సెమినార్ హాల్లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరమూ మార్చి 15న వినియోగదారుల రక్షణను ప్రోత్సహించడం, వినియోగదారుల హక్కుల గురించి ప్రపంచ జ్ఞానాన్ని పెంచడం లక్ష్యంగా ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జాలా ప్రభాకర్, సీనియర్ న్యాయవాది, ఎక్స్ నామినేటెడ్ సభ్యులు లోక్ అదాలత్, ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం స్టేట్ లీగల్ అడ్వైజర్, కడప వారు, ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, కామర్స్ లెక్చరర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ నీలయ్య, డాక్టర్ నాగరాజు, రెడ్డి బాష, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** మండలంలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల దినోత్సవ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణమ్మ అధ్యక్షతన పాఠశాలలోని బోధన, బోధ నేతర సిబ్బందికి, విద్యార్థులకు వినియోగదారుల హక్కుల చట్టాలపై పాఠశాల స్టాండర్డ్ క్లబ్ కన్వీనర్ బి.మహేశ్వర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తొమ్మిదవ తరగతి విద్యార్థులకు, వినియోగదారుల ఫోరం క్లబ్ సభ్యులకు పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

కొర్రపాడు గ్రామంలోని ఆర్‌బికెలో శుక్రవారం వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ గ్రామానికి చెందిన 78 మంది రైతులకు పత్రాలు అందజేసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా ఉన్న 12 ఆర్‌బికెల పరిధిలో 1,638 మంది రైతులకు పంట నమోదు ధ్రువీకరణ హక్కు పత్రాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **లింగాల :** 2023-24 ఏడాదిలో పంటలకు సంబంధించి రైతులకు ధృవీకరణ పత్రాలు అందజేసినట్లు వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం దొండ్ల వాగులోని రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రం ఆర్‌బికె సిబ్బంది నుంచి తీసుకోవాలన్నారు. వీటి ద్వారా పంటల బీమా, పంట నష్టపరిహారం, రైతు భరోసా, పిఎం కిసాన్, సున్నా వడ్డీ, పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు పొందడానికి ఉపయోగపడతాయన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	షహారీ
శనివారం (సా)	ఆదివారం (ఉ)
6.30	5.07

వృద్ధురాలితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

పేదలకు వరం ఆరోగ్య సురక్ష : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - చాపాడు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని ఎన్.ఓబాయపల్లె సచివాలయం పరిధిలోని నక్కలదిన్నెలో సచివాలయంలో జాస్ ప్రోగ్రామ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. వైద్యులు పి.కావ్య మాధురి, ఓబులేసు, స్పెషలిస్ట్ వైద్యులు మధు, సాహుల్‌లతో రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిడమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, ఎంపిడిఒ మహబూబ్‌బీ, ఇఒపిఆర్‌డి రాధకృష్ణ వేణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్ వైజర్లు సరస్వతి, బాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, సచివాలయం సిబ్బంది, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మటన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న వై.ఎస్.మనోహర్‌రెడ్డి

వైఎస్‌ఆర్ మటన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన వైఎస్‌ఆర్ మటన్ మార్కెట్‌ను శనివారం పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కమిషనర్ రమణారెడ్డి, కౌన్సిలర్ లక్ష్మి ప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక నూతన టెక్నాలజీతో నిర్మించిన మటన్ మార్కెట్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని వారన్నారు. ఈ మార్కెట్లో పొట్టేలు మాంసం, మరొక పక్క చికెన్, చేపల అంగళ్లు పెట్టుకోవచ్చు అన్నారు. వ్యాపారుల కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జులు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, పద్మనాభ రెడ్డి, వీరారెడ్డి, రవి, సంపత్, యూత్ నాయకుడు ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు డాక్టర్ ఎం.ఖాదర్‌బాష పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్వాతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో సిరి నిరాశ్రయుల వసతి గృహంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ సభ్యులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులను అందజేశామన్నారు. బిపి, షుగర్, మొదలగు రోగాలకు ఉచితంగా మందులు అందించామన్నారు. అలాగే క్షయ, టీబీ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు కుమారి, ప్రశాంతి, ఆశ వర్కర్లు ఉషారాణి, కాంతమ్మ పాల్గొన్నారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక 4వ వార్డులో శుక్రవారం గాంధీనగర్, కచేరీ వీధి, పురుషోత్తం రెడ్డి కాలనీ ప్రాంతాలలో కౌన్సిలర్, జెసిఎస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిశోర్ ఆధ్వర్యంలో ప్రతి గడప కు వెళ్లి వైసిపి అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, వైఎస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు కడియాల లక్ష్మి నారాయణ, ఫైర్ రామకృష్ణ , గండి ఆంజనేయులు, కిరణ్, హరి, విష్ణు, విశ్వ, ప్రశాంత్, మహేష్, పెద్ద యెత్తున కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** పార్టీలకు కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి పథకాలు అందించారని చక్రాయపేట మండల అధ్యక్షులు మాధవి బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సురభి పంచాయతీలోని బండ్లయ్య గారిపల్లె, రెడ్డివారిపల్లె గ్రామాల్లో వారు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండల సమన్వయకర్త ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఏ పథకం ఒక పథకం ద్వారా లక్షలాది రూపాయలు అందాయని, యథావిధిగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలనికోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వైయస్సార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప

బాలింతలు, గర్భిణీలు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు పోషకాహారం తప్పనిసరి అని అంగన్వాడీ టీచర్ వై. స్నేహలత పేర్కొన్నారు. పోషణ పక్వాడ పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం మోచంపేట సెక్టార్, రవీంద్ర నగర్-4 అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.కె. సృజనీ మాట్లాడుతూ అంగన్వాడీ ద్వారా మూడు సంవత్సరాల లోపు పిల్లల పెరుగుదలకు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిసి రోడ్డుకు భూమిపూజ

ప్రజాశక్తి - కడప

భూమిపూజ చేస్తున్న నాయకులు

21వ డివిజన్‌లోని శాంతిసాగర్ వీధిలో కార్పొరేషన్ జనరల్ ఫండ్ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించబోయే సిసి రోడ్డుకు డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జి మోతు కూరి సుబ్బ రాయుడు, కార్పొరేటర్ మోతుకూరి సుజాత భూమి పూజ చేశారు. రోడ్డు మంజూరుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, కమిషనర్‌కు డివిజన్ ప్రజల తరఫున ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కళ్యా సుధాకర్, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఎస్‌పి

సమస్యాత్మక ప్రాంతంలో పర్యటిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికిలోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన పెద్ద దండ్లూరు, దేవగుడి, గొరిగెనూరు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఎవరి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దన్నారు. పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ప్రలోభాలు, బెదిరింపులు ఎవరైనా చేసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం కేంద్ర సాయుధ బలగాలతో పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశం నిర్వహించి జాగ్రత్తగా ఉండాలని, నేర చరిత్ర కలిగి ఉన్న వారిపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి కౌంటింగ్ పూర్తయిన రోజు వరకు ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డిఎస్‌పి డాక్టర్ టిడి యశ్వంత్, ప్రొహెబేషనరి డిఎస్‌పి శ్రీకాంత్, జమ్మలమడుగు అర్బన్ సిఐ కరుణాకర్, కేంద్ర బలగాల ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ జితేంద్ర కుమార్, ఎస్ఐ సుబ్బారావు పోలీస్, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు

ముద్దనూరు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీసులు అండగా ఉంటామని సిఐ దస్తగిరి అన్నారు. ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు శుక్రవారం సిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు వీధుల్లో కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్యారు. అల్లర్లకు పాల్పడి గొడవలు సృష్టిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు నాయకులు ప్రజలు సహకరించాలని కోరారు. సుమారు 60 మంది కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు.

ముద్దనూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంక్షేమ సంఘం నాయకులు

బలిజల ద్రోహి 'ముద్రగడ'

ప్రజాశక్తి -కడప అర్బన్

కాపు కులస్తుల పాలిట గోముఖ వ్యాగ్రమ్ ముద్రగడ పద్మనాభం అని జిల్లా బలిజ సంక్షేమ సంఘం నాయకులు హరిప్రసాద్, నాగరాజు, గంధంప్రసాద్ అన్నారు. శుక్రవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవు ముఖం అడ్డం పెట్టుకుని ఉన్న వ్యాగ్రమ్ ముద్రగడ అని కాపు, బలిజ, ఒంటరి ల కులస్తులను అడ్డం పెట్టుకుని తన పబ్బం గడిపే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఒక్క ముద్రగడ పద్మనాభమే గుర్తుకు వస్తారని చెప్పారు. కాపు కులంను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తూ కాపులను జగన్ మోహన్‌రెడ్డి కాళ్ళ దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ పార్టీకి మద్దతు ఇవ్వాలంటే ఎన్నో షరతులు పెట్టారని గుర్తు చేశారని పేర్కొన్నారు. జగన్ మోహన్‌రెడ్డి వద్ద ఎలాంటి షరతులు లేకుండానే తండ్రి కొడుకులు ఇద్దరు మొకరిల్లారని విమర్శించారు. బలిజల ద్రోహి ముద్రగడ వీరికి తొందరలో కాపులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షులు దండుశివ, కుప్పాల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నగరంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని చిలకల బావి వీధి, కెసికెనాల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన షా అల్ షిఫా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను మాజీ డిప్యూటీ మేయర్ బి.అరిఫుల్లా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి వాడలోని పేద ప్రజల కోసం వైద్య సేవలు అందించాలని ఇటువంటి వైద్యశాల ప్రారంభించడం అభినంద నీయమన్నారు. డాక్టర్ ఆస్మా స్త్రీ వైద్య నిపుణులుగా మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించి క్లినిక్ ప్రారంభించడం గొప్ప విషయం అన్నారు. షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ ఉమెన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ మొహమ్మద్ షా షేక్ మాట్లాడుతూ క్లినిక్ లేని చోట క్లినిక్ ను ప్రారంభించడం హర్షనీయమన్నారు. పేదల ఉన్న చోట అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం ప్రశంసనీయమన్నారు. తన కౌన్సిల్ ఆధ్వర్యంలో నెలకు రెండు రోజులు ఉచిత వైద్యాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సెంటర్ అధినేత డాక్టర్ ఆస్మా, డాక్టర్లు షేక్. ఫరీద్, ఇలియాస్, కె.బషీర్ అహ్మద్, జమాల్, ఆరిఫా, ఎం.డి రఫీ, ప్రముఖులు అస్లాం బాష పాల్గొన్నారు.

ఇంటి స్థల హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శివమ్మ

పేదల కలలు నెరవేరిన క్షణం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పేదల కల సొంతింటి కల నెరవేరిన క్షణం ఇదని జమ్మలమడుగు మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అన్నారు. శుక్రవారం ఎత్తపువారి కాలనీలోని సచివాలయంలో వైసిపి 11వ వార్డు కౌన్సిలర్ పి. పోచిరెడ్డి చేతుల మీదుగా ఇంటి స్థల హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా ఇంటి స్థలాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. అనంతరం 11వ వార్డు కౌన్సిలర్ పి. పోచిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వటమే కాక వారికి భరోసాగా ఇళ్ల పట్టాలు పంపిణీ చెయ్యడం సంతోషం అన్నారు. 210 లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి, డి.శివా రెడ్డి, డి.శ్రీనివాస రెడ్డి, డి.రవీంద్రనాథ్ రెడ్డి, ఐజయ్య, మనోహర్, మూర్తి కిరణ్, రాజశేఖర్, వైసిపి అభిమానులు, విఆర్ఒ శంకర్ రెడ్డి , వాలంటీర్లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

గోపవరానికి 'మొల్ల' పేరు పెట్టాలని డిఆర్‌ఒకు వినతి

ప్రజాశక్తి- కడప అర్బన్

డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న గానుగపెంట హనుమంతరావు

జిల్లా కేంద్రమైన కడపలో మహా కవయిత్రి మొల్ల పేరుతో తెలుగు అకాడమీ ఏర్పాటు చేసి, గోపవరం మండలానికి మొల్ల పేరు పెట్టాలని మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గానుగపెంట మాట్లాడుతూ కడపలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలకు మొల్ల పేరు పెట్టాలని, మొల్ల సాహిత్య పీఠ కార్యాలయానికి ఐదు సెంట్లు స్థలం కేటాయించాలని, గోపవరంలోని రామాలయాన్ని, శ్రీకంఠ మల్లేశ్వర ఆలయాన్ని, మొల్ల బండను పునర్నిర్మాణం చేయాలని, అలాగే మొల్ల జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టాలని కోరారు. డిఆర్ఒ సానుకూలంగా స్పందించినట్లు హనుమంతరావు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

రక్తదానం సామాజిక బాధ్యత

- వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

యువత, వి ద్యార్థులు రక్తదానాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఆరు నెలలకు ఓసారి రక్తదానం చేయాలని వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి జీవం పోసే మహోన్నత పాత్ర రక్తదాతలదన్నారు. రక్తదానం చేయాలని, మరి కొంతమందిని ప్రోత్సహించాలని సూచించారు. సైన్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రత్యేక కార్యక్రమాలో రక్తదానం చేస్తూ ఉంటానని తెలిపారు. హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసర్ తప్పెట రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతన్నారు. రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజేంద్ర, వైవీయూ హెల్త్ సంటర్ డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి ఆరోగ్యవంతమైన యువకులు రక్తదానం చేయవచ్చన్నారు. తద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి 80 మంది విద్యార్థులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, వై వి యు హెల్త్ సెంటర్ వైద్య సహాయకులు రెడ్డి బాష, వాలంటీర్లు పాల్గొన్నారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

వైవీయూ దూరవిద్య ప్రతి ఒక్కరికీ దగ్గరవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి యోగి వేమన విశ్వవిద్యాలయం దూరవిద్య దగ్గరయ్యేలా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నామని వైవీయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి తెలిపారు. అధ్యయన కేంద్రాల ప్రతినిధులతో ప్రొఫెసర్ కృష్ణారెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిఎ, ఎంసిఎతో పాటు, మరిన్ని డిప్లమా కోర్సులు, ఉపాధి అవకాశాలు గల కోర్సులు విసి మార్గదర్శకం మేరకు ప్రారంభించనున్నామన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించి నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన స్టడీ మెటీరియల్ ప్రొఫెసర్స్‌తో తయారు చేయించామన్నారు. ఐ ఎస్‌బిఎన్ నంబర్‌తో ప్రముఖ పబ్లిషర్స్‌తో పుస్తకాలను ముద్రించామని తెలిపారు. వీటిని క్షుణ్ణంగా చదవడం ద్వారా భవిష్యత్తులో నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్, స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ వంటి పరీక్షలు, జెఎల్, డిఎల్ పరీక్షలు ఉత్తీర్ణత కావచ్చన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం- 2020 ప్రకారం రూపొందించిన అభ్యసన సామగ్రిని అభివర్ణించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభ్యాసకుల పక్షమే ఉంటుందన్నారు. హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్ష గల వారికి వైవీయూ దూరవిద్య కోర్సులు ఒక వరమన్నారు. దూరవిద్య కేంద్రము ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ అభ్యసన సామగ్రి ప్రతి విద్యార్థికి చేరాలని సూచించారు. కొత్త కోర్సులు, పరీక్షలు, అకడమిక్ క్యాలెండర్ పై చర్చించి సంచాలకులు పలు సూచనలు చేశారు. అనంతరం అధ్యయన కేంద్రాలకు సబ్జెక్టు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II- ADDITIONAL DISTINCT JUDGE KURNOOL AT ADONI.
O.S.NO. 16/2021

Between. -
K.Rafeeq and others. ...plaintiffs
Vs
M.Abdullah and others. ...Defendants
To:- D-5) Wahida Khatoon wife of Safiullah,
7/248, Raveendra Nagar, Kadapa.

The above named plaintiffs have filed the above suit for specific performance of an agreement of sale against you and the same is posted to 20-03-2024 for your appearance. You are hereby directed to appear in person or through pleader on the aforesaid date at 10-30 A.M., failing which you will be set exparte.

Sd/-G.V. Desai
Advocate for plaintiffs.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA
G.O.P.No. 14/2024

(In the matter of appointment of guardian for the minor children's viz.,
1. Kodedela Lasya Reddy, aged about 09 years
2. Kodidela Charvin Reddy, aged about 6 years for their person)
1. Kodedela Lasya Reddy (Minor)
2. Kodidela Charvin Reddy (Minor)
Petitioners No.1 and 2 are minors being represented by their aunt as a guardian namely Bandi Uma Maheswari.
3. Bandi Uma Maheswari ...Petitioner
Vs
Nil. ...Respondent

NOTICE

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పైన తెలిపిన గార్డియన్ పిటిషన్‌లో మైనర్స్ అయిన కె.లాస్యరెడ్డి, మరియు కె.చర్విన్ రెడ్డిలను గార్డియన్‌గా నియమించుటకు దాఖలు చేయుచున్నది. పైన తెలిపిన గార్డియన్ పిటిషన్ 15/4/2024వ తేదీన వాయిదా వున్నది. ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల పైన తెలిపిన తేదీన ఉదయం 10.30 గం॥లకు పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపవలెను. లేనిపక్షంలో పరోక్షంగా తీర్మానించబడును.

//By Order of the Court//
G.MADAN MOHAN REDDY
Advocate, Kadapa.

రైతుల చూపు కాంగ్రెస్ వైపు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పాలనలోనే రైతుల పరిస్థితి బాగుంటుందని కాంగ్రెస్ రైతు మిత్ర పార్టీ అని కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు రైతు వ్యతిరేక పార్టీలుగా రైతులు భావిస్తున్నారని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం, జగన్ ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కిసాన్ న్యాయ్ పేరిట రైతుల కోసం 5 గ్యారంటీలను ప్రకటించడం హర్షణీయం అన్నారు. స్వామినాథన్ మిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం జరుగుతుందని చెప్పారు. రైతు రుణమాఫీ చేసేందుకు శాశ్వత రుణ మాఫీ కమిషనర్ ఏర్పాటు చేస్తారన్నారు. పంట నష్టం జరిగిన 30 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో పంటల బీమా జమ చేస్తారన్నారు. రైతు ప్రయోజనార్థం కొత్త దిగుమతి - ఎగుమతి విధానాన్ని తీసుకొస్తారని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులపై జిఎస్‌టి మినహాయింపు అన్నారు. 5 గ్యారంటీలు అమలు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరారు. కాబట్టి రాబోవు ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేయాలని తులసిరెడ్డి కోరారు.

కూటమిదే విజయం : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డి పాలనకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు చరమగీతం పాడబోతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎబిపి-సిఓటర్, న్యూస్ 18 మెగా ఒపీనియన్ పోల్ సర్వే ఫలితాలు చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందని తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమికి ప్రజలు పట్టం కట్టనున్నట్లు జాతీయ మీడియా సంస్థలు అంచనా వేశాయని పేర్కొన్నారు. ప్రముఖ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలో కూటమికి సుమారు 20 ఎంపీ సీట్లు వస్తాయని పేర్కొందని తెలిపారు. మరోవైపు న్యూస్ 18 నిర్వహించిన మెగా ఒపీనియన్ పోల్ కూడా తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని అంచనా వేసిందని పేర్కొన్నారు. జగన్ రెడ్డి గద్దె దిగే రోజు దగ్గర్లోనే ఉందని, ప్రజలు కూటమికి మద్దతుగా నిలుస్తున్నారని స్పష్టం అవుతోందని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి అక్రమ, అవినీతి పాలన ముగింపు దశకు చేరుకుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలనకు వ్యతిరేకంగా నిలుస్తున్నారని సర్వే గణాంకాలే పేర్కొంటున్నాయని తెలిపారు. జగన్ అరాచక పాలనకు ముగింపుకు కౌంట్ డౌన్ ఇప్పటికే మొదలైందని పేర్కొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - చాపాడు

కస్తూరిబా బాలికల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికిగానూ 6, ఇంటర్ మొదటి సంవత్సరంచ 7,8,9 తరగతులలో మిగిలి పోయిన సీట్లకు సంబంధించి ప్రవేశాలు కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11లోగా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, పేద విద్యార్థులు, ఎస్సీ ,ఎస్టీ, బీసీ మైనారిటీ, బిపిఎల్ కుటుంబాలకు చెందిన బాలికలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. https://apkgov.apcfss వెబ్‌సైట్‌లో విద్యార్థినులు దరఖాస్తు చేసుకుంటే వారి మొబైల్ కుమెసేజ్ వస్తుందన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, పూర్వ పాఠశాల తరగతి వివరాలు, విద్యార్థిని పాస్ పోర్టు సైజు ఫొటో అందజేయాలన్నారు.

అక్రమంగా కట్టిన గోడను కూల్చివేయాలి

ప్రజాశక్తి - కడప

అక్రమంగా కట్టిన గోడను కూల్చివేయాలని కోరుతూ శుక్రవారం కడప తహశీల్దార్‌కు మల్లెం రమణమ్మ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కడప నగరం చిన్న చౌక్ అశోక్ నగం నివాసముంటున్న తన ఇంటి స్థలాన్ని ఆక్రమించి, రాత్రి రాత్రికి పునాదులు తీసి అక్రమంగా గోడ నిర్మించారని పేర్కొన్నారు.ఈ విషయంపై చిన్న చౌక్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసు వారు సరైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కలెక్టర్, డిఆర్ఒకు, తహశీల్దార్‌కు విన్నవించానని చెప్పారు. తాను వృద్ధురాలిని కావడంతో బెదిరించి గోడ నిర్మించారని వాపోయారు. దండాల వెంకట సుబ్బమ్మ వారికి ఎటువంటి డాక్యుమెంట్స్ లేవని రమణమ్మ తెలిపారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఇమాం నగర్‌లో కళింగర కాయలు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

కళింగర కాయలను అందిస్తున్న దాతలు

రంజాన్ ఉపవాసాలను పురష్కరించుకొని వేంపల్లెలోని ఇమాం నగర్, విశ్వనాథ్ మిషన్ వీధిల్లో ఉన్న ప్రజలకు కళింగర కాయలు పంపిణీ చేశారు. శుక్రవారం టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ లోడ్ కళింగర కాయలను తీసుకొని వచ్చి ఇంటింటికి వెళ్లి అందజేశారు. ప్రతి ఏడాది రంజాన్ ఉపవాసాలను పురష్కరించుకొని ప్రతికి ఇంటికి కళింగర కాయలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ముస్లిం ప్రజలతో పాటు వీధిలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు కూడ కళింగర కాయలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.వి రమణ, మహబూబ్ షరీఫ్, ఇలియాస్, గొటూరు నాగభూషణం, ఫయాజ్ బాషా, మాబు వలి, హబీబ్ పాల్గొన్నారు.

నేడు, రేపు శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు

ప్రజాశక్తి-కడప సిటీ

నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలను శని, ఆదివారాలలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోవిందునాగరాజు, సిఆర్ఐ సునీల్, పల్లా రాధాకృష్ణ ,సంగినాదం ఆంజనేయులు, కొరముట్ల పెద్ద సుబ్బరాయుడు, ఇట్టే వేణు గోపాల్, పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విజయ దుర్గా దేవి కాలనీలో ఉన్న పార్కు నుంచి ఊరేగింపుతో బిందెసేవ నిర్వహిస్తారన్నారు. కలశాలు ధరించిన భక్తులు అక్కడి నుంచి పార్కు వద్దకు ఊరేగింపుగా చేరుకుంటారన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతులు విజయ దుర్గాదేవి కాలనీలోని పురవీధులలో భక్తులకు కనువిందు చేస్తాయన్నారు. జ్యోతి ఉత్సవాలలో కడప నగర ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు పిలుపునిచ్చారు

మహారాజ శ్రీ నంద్యాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
ఓ.యస్. నెం. 41/2022

బొగ్గరపు కళ్యాణి. ...వాది
వర్సెస్
గంజి వెంకట సుబ్బయ్య
తండ్రి: వెంకట సుబ్బయ్య,
C/o.వీరభద్ర షాపింగ్ మాల్,
ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం,
కడప జిల్లా. ...ప్రతివాది

ప్రతి వాదికి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతి వాదులు అయిన మీ పైన దావా బాపత్తు మొత్తము రాగోరి కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. అందులో మీకు దావా సమన్లు ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు కొరకై 03-04-2024 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. పై అమలు దావా సంబంధించి, మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 03-04-2024 వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకోవనలేను. లేనియెడల పై కోర్టు వారు మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 03-04-2024

అడ్డగాళ్ళ వెంకటేశ్వర్లు,
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల జిల్లా.
సెల్ నెం. 9440290132.